కామెడీ కథ

# నిధి చాల సుఖమా?

నవీన్ రూమ్‌లో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఇళ్లకి పై కప్పు క్రింద ఏం వేద్దామా అని మాత్రం కాదు!

కౌన్ బనేగా కరోడ్‌పతి అమితాబ్ ద్వారా అర గంటలో లక్షాధికారి కావడం ఎలా? లేదా రోజులో లక్షాధికారి కావడం ఎలా? నెలలో కోటీశ్వరుడు కావడం ఎలా? ఇలాంటి ఆలోచనలు పిచ్చి పిచ్చిగా చెలరేగిపోతున్నాయి.

అప్పుడు వచ్చాడు నవీన్ రూమ్‌లోకి నవీన్ స్నేహితుడు మదన్! అతన్ని చూసి ''లక్షలు సంపాదించడం ఎలా?'' అన్నాడు నవీన్.

''ఓస్! అదో పెద్ద విషయమా? అంబడిపూడి పుస్తకాలు చదువు'' సహో పారేశాడు మదన్.

''పాత కాలం ఆలోచనకాదు కొత్త ఆలోచన చెప్పు''

''జావా చెయ్యి! అమీర్‌పేట నుంచి అమెరికాకే!'' ఉత్సాహంగా చెప్పాడు మదన్.

''జావా చెయ్యాలా? ఎలా కనిపిస్తున్నానురా? మరీ అంత వెధవలా కనిపిస్తున్నానా? ఓ మాదిరిగా కూడా కనబడడం లేదా? వినలేదా జావా వాళ్ల హాహాకారాలు వాళ్ల పాటలు'

''జావాయే ఉండగా జీవితమే పండగ అనుకుని చదివేస్తే అయిందండి దండగ- అని ఖుషీ స్టైలులో పాడుకుంటున్నారు. అది కాదు గాని మరొకటి చెప్పు'' అన్నాడు నవీన్ ప్రొద్దున మిగిలిపోయిన 'టీ'ని వెచ్చబెడుతూ.

''పోనీ రాష్ట్రస్థాయిలో అన్ని చోట్ల బ్రాంచీలు తెరిచి పెద్ద చిట్ ఫండ్ కంపెనీ పెడదాం. నాలుగు నెలల తర్వాత బిచాణా ఎత్తేదాం. అంతా డబ్బే! అక్కడి నుంచి గల్ఫ్ పోవచ్చు.''

''చీట్ ఫండ్ కంపెనీ అని చెప్పి పోలీసులు తీహార్ జైలులో వేస్తారు. నాకీ పుచ్చు ఆలోచనలు ఇవ్వకురా!' అని విసుక్కున్నాడు నవీన్!

ఇద్దరూ డబ్బు ఆలోచనలో పడ్డారు.

ఆ సమయంలో వాళ్ల రూంలోకి ప్రవేశించాడు వాళ్ల స్నేహితుడు వామనరావు. ఇదీ స్పెషల్ క్యారెక్టర్. ఇతను తన దగ్గరనున్న డబ్బులు ఖర్చు పెట్టడు. సిగరెట్లకి, టీలకి, టిఫిన్లకి, పోస్టల్ స్టాంపులకి స్నేహితుల మీద ఆధారపడతాడు. అంటే 'వాలి'పోతాడు. స్నేహితులు ఇతన్ని 'వాలేశ్వరరావు' అని పిలుస్తారు. వాలేశ్వరరావు, సారీ, వామనరావురూమ్‌లోకి రాగానే నవీన్‌కి గుండె దడపుట్టుకుంది, ఏం పట్టుకుపోతాడో అని!

వామనరావు రాగానే అడిగారు- లక్షలు సంపాదించే ఆలోచన చెప్పమని.

''సరిగ్గా అది చెప్పడానికే నేను వచ్చాను'' అన్నాడు వామనరావు ఉత్సాహంగా.

''చెప్పు! చెప్పు!'' అడగకుండా సిగరెట్ ఆఫర్ చేశాడు మదన్.

వామనరావు జేబులో నుంచి ఓ రాగిరేకు, ఒక ఆంధ్రప్రదేశ్ మ్యాపు తీశాడు. ఆలోచన అంటే పాత సామాన్లు కొనేవాడిలా అవీ, ఇవీ తీస్తున్నాడు ఏమిటి అని మదన్ ఆలోచనలో పడ్డాడు.

వామనరావు ప్రారంభించాడు.

''చూడండి! ఈ రాగిరేకు మా తాతగారి పెట్లో దొరికింది. దానిలో సంస్కృతంలో రాసిన దాన్ని నేను అనువాదం చేయించుకుని గ్రహించిన విషయం ఏమిటంటే తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలో వున్న రంపచోడవరంలో నైరుతి దిక్కున ఒక 'నిధి' ఉంది! ఆ నిధిని క్రీస్తు పూర్వం ఓ రాజు శత్రురాజులు తరుముకొస్తుండగా అక్కడ పాతిపెట్టాడు. నిధిలో బంగారు ఆభరణాలు, వజ్రాలు ఉన్నాయని రాశారు. కనుక మనం కొంచెం కష్టపడితే ఆ నిధి దొరకవచ్చు'' అని ఆగాడు ఎవరయినా టీ ప్రయత్నాలు చేస్తున్నారా లేదా అని.

''చందమామ చదివి చాలా కాలం అయింది. ఇదిగో మళ్లీ ఇన్నాళ్లకి మనవాడు వినిపిస్తున్నాడు'' అన్నాడు మదన్.

''అలా కొట్టిపారెయ్యకూడదు. ట్రై చేద్దాము? ఎవరికి తెలుసు ఏ పుట్టలో ఏ పాముందో?'' అన్నాడు నవీన్.

''అవునవును! ఆ ఏజెన్సీలో ప్రతీ పుట్టలోనూ ఒక పాముంటుంది'' అన్నాడు మదన్.

''నెగెటివ్ ఆలోచనలు ఎందుకురా? కొంచెం కష్టపడి వెళ్లి నిధిని తవ్వుకుని స్వాధీనం చేసుకుంటే జీవితాంతం సుఖంగా, హాయిగా బ్రతకొచ్చు. ఎందుకొచ్చిన జాబ్‌లు! గొర్రెతోక జీతాలు! ఆలోచించండి'' సిగరెట్ పొగ రింగురింగులుగా వదులుతూ అన్నాడు వామనరావు.

''నాకెందుకో జీవితాంతం సుఖపడడం కాదు, జీవితమే అంతం అయిపోతుందేమో ఆ ఏజెన్సీకి వెళితే అనిపిస్తోంది'' అన్నాడు నవీన్.

''రాగి రేకును నమ్మవచ్చు అంటావా?'' సందేహంగా అడిగాడు నవీన్.

''మీకన్నీ సందేహాలే! మీకు నమ్మకం లేకపోతే వదిలెయ్యండి. నా క్లాస్‌మేట్ శంకర్, నేను ట్రై చేసుకుంటాం'' అన్నాడు విసుగ్గా వామనరావు.

''నాయనా! వామనా! తొందరేల? డబ్బు మీద మాకు ఆశ లేదా?'' అని నవీన్,

''నాకు మాత్రం దురాశ లేదా?'' అని మదన్, నువ్వు చెప్పినట్టే ఒక మంచి రోజు చూసుకుని ఛలో రంపచోడవరం- అని చెప్పారు.

ముగ్గురు మిత్రులు ఒక నిర్ణయానికి వచ్చారు.

★★★

రంపచోడవరం ఏజెన్సీలో ఒక రూమ్ తీసుకోవడానికి లాడ్జికి వచ్చారు.

లాడ్జి యజమాని రూమ్ ఇస్తూ- ''పారుగూరు వాళ్లలా ఉన్నారు! ఏం పని మీద వచ్చారు?'' అని అడిగాడు.

''ఏమంటారా? మా వామనరావు వాళ్ల తాతగారికి తద్దినం పెట్టడానికి హైదరాబాదులో బ్రాహ్మణుడు దొరకలేదు. ఇక్కడి నుంచి తీసుకువెళదామని'' అన్నాడు మదన్.

''తద్దినం బ్రాహ్మణుడి గురించి వచ్చారా? ఆశ్చర్యంగా ఉంది. తండ్రి తద్దినం కూడా పెట్టని కొడుకులున్న ఈరోజుల్లో తాత తద్దినం మీద ఇంత శ్రద్ధతో రావడం ఆశ్చర్యంగా వుంది''

''కదా! అందుకే ఈ వార్త వింతలు- విశేషాలు అని ఏదైనా దిన పత్రిక జిల్లా ఎడిషన్‌లో వేయించుకో. ప్రస్తుతానికి మా తాళాలు మాకియ్యి'' అంటూ నవీన్ తాళాలు పుచ్చుకున్నాడు.

ముగ్గురు మిత్రులూ రూమ్ వైపు వెళుతున్నారు.

లాడ్జి యజమాని రూమ్ బోయ్‌ని పిలిచి -

''ఈ కుర్రాళ్ల వాలకం అనుమానంగా వుంది. కాస్త కన్నేసి ఉంచు.'' అని చెప్పాడు.

'తాత తద్దినం గురించి వచ్చారట. తేడా వస్తే తాతగారి దగ్గరికి పోతారు కుర్రకుంకలు' అని మనసులో అనుకున్నాడు లాడ్జి యజమాని.

''మీరు ఆర్డరు వెయ్యండి. ఈళ్ల మీద డికాషన్ చేసేస్తాను'' అన్నాడు రూమ్‌బోయ్ హుషారుగా!

''బాబూ! డికాషన్ కాదు డిటెక్షన్'' అని ఆంగ్ల భాషను సవరించాడు లాడ్జి యజమాని.

★★★

మర్నాడు మిత్రులు ముగ్గురూ రాగిరేకుల మీద గుర్తు ప్రకారం 'నిధి' ఉన్న చోటికి వెళ్లారు.

ఆ ప్రదేశం ఒక రైతు తోటలో ఉంది. రైతుని కలిసి విషయం చెప్పి నిధిలో వాటా ఇస్తామని



త్రవ్వుకోడానికి అనుమతి డిగారు. సగం ఇస్తే కాని ఒప్పుకోనన్నాడు. నో న్నారు మిత్రులు.

''అలాగే! నాకు తెలి కుండా నేల మీద గునపం పడిందా మీ గుండె ్లో గునపం దిగుద్ది'' అన్నాడు ఆ రైతు.

''సరే... ఇంత దూ ం వచ్చాక గొడవ ఎందుకు? రేపటి నుంచి త్రవ్వకం మొదలు పెడతాం. నువ్వు ఊళ్లో ్కకి నచ్చ చెప్పుకో'' అన్నాడు వామనరావు గొడ పెరగకుండా.

★★★

మర్నాడు నవీన్ గునపం ో తవ్వడం మొదలు పెట్టాడు ఉత్సాహంగా!

అరగంట అయింది. పైన సూర్యారావు పేట్రే గి ోవడం మొదలుపెట్టాడు. ఆయాసం వస్తోం డ తవ్వడం ఆపి మదన్‌కి గునపం ఇచ్చాడు. వా మనరావు పారతో మట్టి తీస్తున్నాడు.

అప్పుడు అక్కడికి ఒక వ్యక్తి వచ్చాడు.

ఆకుపచ్చని డ్రెస్సు ధరించాడు. చేతిలో గన్ ఉంది. చెస్టు మీద బుల్లెట్ల పట్టీ ఉంది.

''ఏం కావాలండీ?'' అడిగాడు వామనరావు.

''ఏంటీ ఈ నక్సలైట్ నారాయణ అలియాస్

ఎం. వీరేశ్వరరావు

రంగాను పలకరించే ధైర్యమా? ఏంటి చేస్తు న్నారు?''

''కనబడటం లేదా తవ్వుకుంటున్నాం. నువ్వు నిజం నక్సలైట్‌వా? లేదా ఊరికే కాలక్షే ద్దలా అలా గన్‌ని భుజాన్న వేసుకుని అడవి రేగిపళ్లు ఏరుకుంటూ కాలక్షేపం చేస్తున్నావా?'' నవ్వుతూ అడిగాడు మదన్.

''ఏంట్రా? నక్సలైట్‌తో వేళాకోళమా? మీ వాలకం చూస్తే ఇన్‌ఫార్మర్స్‌లా ఉన్నారు. చెప్పండి కత ఏమిటో?''

''నీకు చెప్పం ఫో'' అన్నారు ముగ్గురూ.

వెంటనే నారాయణ చెట్టు మీద వున్న కాకి

గురిపెట్టి కాల్చాడు. అది ఎచ్చి కింద పడింది.

''తెలిసిందా? పిట్టల్ని కాల్చినట్టు మిమ్మల్ని కాల్చేస్తాను తేడా వచ్చిందంటే. చెప్పండి ముందు ఈ నక్సలైట్ నారాయణ అలియాస్ రంగాకి'' అన్నాడు తుపాకిని వామనరావుకి గురిపెడుతూ.

''వీడితో అనవసరంగా తగులుకున్నాంరా దేవుడా!'' అని మనసులో అనుకుంటూ బిక్కచచ్చిపోయి నిల్చుని ఉండిపోయాడు.

సరిగ్గా ఆ సమయంలో వచ్చాడు రైతు.

''అన్నా ఈళ్లు నువ్వనుకుంటున్నట్టు పోలీసు మనుషులు కాదు చదువుకొన్నవాళ్లు. పనుల్లేవని అంటే కండ పట్టని కుర్రాళ్లు కదా ఈ పలుగూ, పార ఇచ్చాను. వదిలెయ్యి''

''నువ్వు చెప్పావు కాబట్టి వదిలేస్తున్నా! లేకపోతే ఈ నక్సలైట్ నారాయణ అలియాస్ రంగా అంటే చుట్టుపక్కల హడల్''

''ఈ అలియాస్ గోల ఒకటి'' విసుక్కున్నాడు మదన్.

''తేడా వచ్చిందో'' అంటూ వెళ్లిపోతున్న వాడు వెనక్కి తిరిగాడు నక్సలైట్.

''అదిగో కాకి గతే మాకు పడుతుంది సార్'' అన్నాడు వామనరావు.

''వెధవ గడ్డం తీసేసి రేపటి నుంచి నున్నగా కనబడు'' అంటూ మదన్ ముఖంకేసి చూస్తూ అని 'అరచేతితో సూర్యకాంతిని ఆపలేరు. విప్లవం జిందాబాద్. తరువాత ఏమిటి? ఏదో ఒకటి, ఎవడు విన్నాడు?' అనుకుని అడవిలోకి వెళ్లిపోయాడు నక్సలైట్ నారాయణ అలియాస్ రంగా.

★★★

మర్నాడు...

''దిక్కుమాలిన వాడు నక్సలైట్‌తో నిన్న మూడ్ చెడిపోయింది'' అన్నాడు నవీన్.

''గుర్తు చెయ్యకురా! ఆ రైతు చూడు మన డిగ్రీలను తీసిపారేసి పనివాళ్లా చేసి మాట్లాడాడు'' అన్నాడు మదన్.

''బాబూ 'నిధి' దొరికేదాకా అన్నీ సహించాలి'' అన్నాడు వామనరావు.

''అలాగే తమరు గునపం పుచ్చుకోండి'' అంటూ గునపాన్ని ఇచ్చాడు నవీన్.

వామనరావు తవ్వడం మొదలుపెట్టాడు. గునపానికి ఠంగ్‌మని తగిలింది.

''అదిగో లంకెబిందెల చప్పుడు'' అంటూ చప్పట్లు కొట్టాడు నవీన్. కొంచెం లోతగా తవ్వితే బయట పడింది ఒక మానవ పుర్రె. అది చూసి వామనరావు మూర్ఛపోయాడు.

ముఖం మీద నీళ్లు కొట్టి ''వెంటనే నిధి దొరుకుతుందా? ముందు పుర్రెలే దొరుకుతాయి, లేచి తవ్వు'' అన్నాడు మదన్.

పుర్రెను చూసి మళ్లీ మూర్ఛపోయాడు వామనరావు.

''నిధి దొరికితే అంతా సుఖమే! స్టార్ హోటల్‌లో టిఫిన్, లంచ్, డిన్నర్, స్టార్ హోటల్ స్విమ్మింగ్ పూల్ ఈతలు, అందమైన అమ్మాయిలు, ఓహో...'' అంటూ కలలు కంటున్నాడు నవీన్.

''నిధి దొరకలేదు అనుకో. స్టార్ హోటల్ గేటు ముందు డ్రెస్సు వేసుకుని 'గుడ్ మార్నింగ్ సార్' అనాలి, రాజాలా అంటే రాజు అని కాదు డ్రెస్సు అలా ఉంటుంది అని'' విసుక్కున్నాడు మదన్.

ఉదయం నుంచి బద్ధకంగా ఉండి అప్పుడే కదిలిన ఒక నల్లని తేలు నవీన్‌ని ముద్దుపెట్టుకుంది.

''అమ్మో చచ్చానురా! తేలు కుట్టింది''

''తేలే కదా! కీలు విరిగినట్టు ఆ గోల ఏమిటి?'' అన్నాడు మూర్ఛ నుంచి లేచిన వామనరావు.

''అంతా నీ మూలంగానే! అమ్మా! పైగా వెధవ ప్రాసలు'' అంటూ నల్లమట్టి వామనరావు మీదకి విసిరాడు.

వామనరావు మట్టి పడకుండా తప్పించుకున్నాడు.

''సర్లెండి, ఈ పూటకి ఆపండి, రేపు చూద్దాం'' అన్నాడు మదన్.

★★★

మర్నాడు తవ్వారు. ఫలితం కనిపించలేదు.

అలా వారం రోజులు గడిచాయి. అనవసరంగా తోట పాడు చేస్తున్నారు, నిధి ఏది? అంటూ రైతు గోల చేస్తున్నాడు.

పది రోజుల తర్వాత నవీన్, మదన్, వామనరావుల ఫొటోలు పేపర్లో పడ్డాయి. ''ఇంటి నుంచి పారిపోయిన ఈ కుర్రాళ్లను మాకు అప్పగించకుండా తేలికగా లక్షలు సంపాదించాలనే దురాశపోయే వరకూ కొట్టమని పోలీసులకు విజ్ఞప్తి'' అంటూ వాళ్ల నాన్నలు ఇచ్చిన ప్రకటన.

పేపరు చూసి ''ఓరి నాయనో పోలీసులు వచ్చేస్తార్రా! నిధి దొరకలేదు, పోలీసుల గోల ఒకటి మధ్యలో. మన నాన్నలకి బొత్తిగా మన మీద ప్రేమలేదురా. పోలీసులకి కొట్టమని ప్రత్యేకంగా చెప్పాలా? తాతకి దగ్గులు నేర్పినట్టు'' గోల పెట్టాడు మదన్.

★★★

నాలుగు రోజుల తర్వాత ఒక ఉంగరం దొరికింది వాళ్లకి.

''దీనినే అంటారు కొండను తవ్వి ఎలకని పట్టడం అని'' అన్నాడు వామనరావు.

''అసలు నిధి ఊసు ఎత్తినందుకు నిన్ను 'యముని సన్నిధి'కి పంపాలిరా'' విసుగ్గా అన్నాడు నవీన్.

వాళ్లు రూమ్‌కేసి వెళుతుండగా ఇద్దరు బలమైన వాళ్లు ఎదురయి ''ఒరే చెప్పండి నిధి ఎక్కడ దాచారో'' అన్నారు.

''నిధి ఏమిటీ? మేము పిక్నిక్‌కి వచ్చాం'' చెప్పాడు మదన్.

''హరికతలు వద్దు, రూంలో మీరు మాట్లాడుకున్నది విని మిమ్మల్ని ఫాలో చేస్తున్నాం'' అన్నాడతను.

''ఇదే గోడలకి చెవులు ఉండడం అంటే'' అన్నాడు వామనరావు. మదన్ గుర్రుగా చూశాడు.

''చెప్తారా? నాలుగు తగిలించమంటారా?'' అందులో ఒకడు ముందుకు వస్తూ అన్నాడు.

''పాము పాము'' అన్నాడు నవీన్ తెలివిగా.

వాళ్లిద్దరూ కిందకి చూశారు.

ముగ్గురు మిత్రులూ బ్రతుకు జీవుడా అంటూ పరిగెత్తి పరిగెత్తి హైదరాబాద్ బస్సు ఎక్కారు.

★★★

అయిదు సంవత్సరాల తర్వాత ముగ్గురూ లక్షలు సంపాదిస్తున్నారు. ఎలా? ఇదిగో ఇలా...

నవీన్-వాస్తు విద్వాన్ నవీన్‌గా మారి

మదన్-జ్యోతిష్యరత్న మదన్‌గా మారి

వామనరావు-ఎం.పి. అయి...

సర్వేజనాః సుఖినోభవంతుః

